కాన్ని, జయ్యీన తోకతొక్కిన పామల్లే లేచింది. పమిటె బొడ్లో దోపింది. తెగించింది. 'మొగుణ్ణి ముండనుచేసి కూర్చోపెట్టి యిష్టంవచ్చినట్టు ఆడుతున్నావు' అన్నది. 'నీ సంగతి ఈ వాడకట్టు అందరికీ తెలుసు'నన్నది. 'మొగుణ్ణి ఆఫీసుకి పంపి రత్తమ్మ కొడుకుని పెట్టుకు కులకటం అంతా చూస్తూనే వున్నారు' అన్నది. 'ఇల్లెవరు గడుపుతున్నారో, మొన్న జాకెట్ గుడ్డ కొని ఇచ్చింది ఎవ్వరో మాకు తెలియ దనుకున్నావా' అని ప్రశ్నించింది. 'అంతా నీలాంటివాళ్ళే అనుకుంటావు; నీ సంగతి మొగుడికి తెలుస్తుందేమో అని, ముందే అందరికీ అంటగడుతున్నావు' అన్నది.

వెంకటేశ్వర్లు అక్కడే వున్నాడు. రామప్ప భార్య మోపుతున్న నిందలన్నీ విన్నాడు. కాని అతనికేమీ కష్టం కలగలేదు. ఆ వాడకట్టులో ఏ కొద్ది పోట్లాట జరిగినా యిటు వంటి నింద మోపటం ఆడవాళ్ళకి అలవాటే. కదిలిస్తే వాళ్ల నోటివెంట వొచ్చే మాటలే యివి. అంతకుముందు యెంత బాగా వుంటున్నా ఏ రకంగానూ అనుమానించటానికి వీల్లేని మనిషైనా కజ్జారాగానే పుటికి పుటిక్కిన రంకుల్ని అంట గట్టడం వాళ్లకు ఆచారం. అందులో వర్ణించి వర్ణించి తిడ తారు. ఆ వైఖరి చూస్తే ఆ విధంగా తిట్టటంలో వాళ్లకు విచిత్రమైన ఆనందం కలుగుతూవున్నట్లు కనిపిస్తుంది. వాళ్లల్లో తీరని కోర్కెలను వేటినో ఆ తిట్లు తీరుస్తూవుంటై. అవ్య క్తంగా వున్న అపేక్షలను నోటిద్వారా తీర్చుకుంటున్నారు అనిపిస్తుంది.

కొట్టింది. సముదాయించింది. ఇన్ని చేసినా ఆమె ఆరాటం తగ్గ లేదు. రామప్పభార్యకు తగినశాస్తి చెయ్యాలని నిశ్చయించుకొని రాజమ్మ ఇంటికి వెళ్ళింది. రాజమ్మను రెచ్చగొట్టింది.

"చూశావంటే దాని మదం" అంది.

రాజమ్మ మాట్లాడలేదు.

"నన్నన్న దానికి నాకేం లేదే. మొగుడితో చెప్పి నీ ఎముకలు విరగ్గొట్టిస్తుందట. పంచాయితీ పెట్టిస్తుందట. నిన్ను యిక్కడ లేకుండా చేస్తుందట ఈ వూళ్లో అన్నం, నీళ్ళు పుట్టకుండా చేస్తుందట..." ఈ విధంగా కల్లబొల్లి కబుర్లు నూరిపోసి బాగా రోషంవచ్చేటట్టు చేసింది రాజమ్మకి. 'రామప్పని కట్టుకో' అని సలహా చెప్పింది. చీకటి పడగానే రామప్ప రాజమ్మ యింటికి వచ్చాడు. రామప్పకి కోడిమాంసం అంటే యిష్టం. రాజమ్మ వండితే తినాలి అంటాడు. రాజమ్మకి ఈ సంగతి తెలుసు. ఆ రాత్రి కోడిమాంసం వొండిపెట్టి, వున్నవీ లేనివీ కల్పించి అతని భార్యమీద చెప్పింది.

"ఇక్కడకురావటం మానుకోకపోతే నన్ను యింటిలో నుంచి గెంటిస్తుందట" అని చెప్పింది. ఆమెకూ మేనల్లుడికీ చిన్నప్పటినుంచీ వున్న సంబంధం చెప్పింది. "వూరంతా ఒకటేగోల. నీకు తెలిసే వూరుకున్నావటగా!" అని అడిగింది.

రామప్ప ఉడికిపోయాడు, గబగబా యింటికివెళ్ళి, భార్యని దబదబా బాదాడు. ఆమె కేకలువిని చుట్టుపక్కల వాళ్లు అంతా పోగయ్యారు. పెద్దవాళ్లు కేకలు వేశారు. 'ఇది తగదు రామప్పా' అన్నారు.

